పగలే వెన్నెల..



జీడిమెట్ల: జీడిమెట్లలో పట్టపగలే విద్యుద్దీపాలు వెలుగుతున్నాయి. విద్యుత్ పొదుపు చేసేందుకు వీధి దీపాల స్విచ్‌ను ఆఫ్ చేయాల్సిన సిబ్బంది పట్టించుకోవడం లేదు. దీంతో జీడిమెట్లలో స్థంబాలకు ఉన్న విద్యుత్ దీపాలు 24గంటల పాటు వెలుగుతూనే ఉన్నాయి.

ఎంపీపీఎస్ పాఠశాల భవనం ప్రారంభం..



పాఠశాల భవనాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

సుభాష్‌నగర్: కార్నివెలి ఫౌండేషన్ సహకారంతో రూ.70 లక్షలతో నిర్మించిన గాజులరామారం ఎంపీపీఎస్ స్కూల్ భవనాన్ని సోమవారం ఎంఈవో జెమినీ కుమారి, కార్నివెలి ఫౌండేషన్ చైర్మన్ జాక్విలెన్ కార్నివెలి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవనంలో ఆరు తరగతి గదులతో పాటు టాయిలెట్లు తదితర సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. తమ సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను మెరుగు పరిచేందుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సురేష్, ఉపాధ్యాయులు మల్లేష్, శ్రవంతి, కార్నివెలి సంస్థ హైదరాబాద్ విభాగం నిర్వాహకులు చంద్రశేఖర్, శివారెడ్డి, బిందు, కాంట్రాక్టర్ రత్నేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై చెత్తను తొలగించండి..



ఎస్వీ కో ఆపరేటీవ్ సొసైటీలో రోడ్లపై పేరుకుపోయిన చెత్త

జీడిమెట్ల: ఎస్వీకో ఆపరేటీవ్ సొసైటీలో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. జీడిమెట్లకు అనుసంధానంగా ఉన్న ఎస్వీ కో ఆపరేటీవ్ సొసైటీలోని రోడ్లలో ఎక్కడ చూసినా చెత్తా చెదారం దర్శనమిస్తున్నాయి. కొందరు వ్యక్తులు పరిశ్రమల నుండి చెత్తను తీసుకువచ్చి రోడ్లపై పారబోసి వెళ్లిపోతున్నారు. చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాల్సిన ఐలా, మున్సిపల్ సిబ్బంది పట్టించుకోకపోవడంతో చెత్త కుప్పలుగా పేరుకుపోయింది. విపరీతమైన దుర్వాసన వస్తుండటంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఐలా మున్సిపల్ సిబ్బంది జోక్యం చేసుకుని రోడ్లపై చెత్తను పారబోయకుండా చర్యలు తీసుకోవడంతో పాటు చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు వాల్మీకి జయంతి

ఆల్విన్‌కాలనీ: వాల్మీకి జయంతి సందర్భంగా మంగళవారం ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని అంబేడ్కర్‌నగర్‌లో సీనియర్ నాయకుడు బోయ కిషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమానికి శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ హాజరు కానున్నారు. ఎల్లమ్మబండలోని జన్మభూమి కాలనీలోని వాల్మీకి విగ్రహం వద్ద ఉదయం 9 గంటలకు కార్యక్రమం కొనసాగుతుందన్నారు. స్థానికులు, నాయకులు, కార్యకర్తలు హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

దుండిగల్: ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి వచ్చిన మరో వాహనం ఢీకొట్టడంతో ఓ వృద్ధుడు మృతి చెందిన సంఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బల్కంపేట్‌కు చెందిన కంతి లక్ష్మీదాస్‌గౌడ్(68) ఈ నెల 1న బైక్‌పై దుండిగల్ నుండి బల్కంపేట్‌కు వెళ్తున్నాడు. మార్గ మధ్యలో కార్టూన్ కంపెనీ సమీపంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన మరో ద్విచక్ర వాహనం లక్ష్మీదాస్ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతడిని సూరారంలోని మల్లారెడ్డి ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ 5న మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్ నయవంచనపై

'బాకీ కార్డు' ఉద్యమం



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు తదితరులు

కుత్బుల్లాపూర్

ఎమ్మెల్యే వివేకానంద్..

ఆచరణ సాధ్యం కాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను మోసం చేసిందని బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే వివేకానంధ్ అన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు మోసపూరిత వాగ్ధానాలతో ప్రజలను వంచించి గద్దెనెక్కిన కాంగ్రెస్ వైఖరిపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ చేపట్టిన 'బాకీ కార్డు' ఉద్యమంలో భాగంగా సోమవారం చింతల్ బీఆర్ఎ కార్యాలయంలో నియోజకవర్గస్థాయి ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. సమావేశానికి వివేకానంద్‌తో పాటు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, బీఆర్ఎస్ మల్కాజిగిరి పార్లమెంటరీ ఇంచార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై 'బాకీ కార్డు' ఆవశ్యకతను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ 100 రోజుల్లో పూర్తి చేస్తామన్న ఆరు గ్యారంటీలను 700 రోజులైనా పూర్తి చేయకుండా మోసం చేసిందన్నారు. రాష్ట్ర అభివృద్ధిని గాలికి వదిలేసిన పాలకులు తమ తప్పులను బీఆర్ఎస్ ప్రభుత్వంపై నెట్టివేస్తున్నారని ఆరోపించారు. ఫోర్త్ సిటీకి రోడ్లు వేయడానికి, మూసీ సుందరీకరణకు రేవంత్ సర్కార్‌కు డబ్బులు ఎక్కడి నుంచి వచ్చాయని, ఈ విషయాన్ని ప్రజలకు వివరించాలన్నారు.

ప్రభుత్వం ఇప్పటికే రాష్ట్రంలోని ఒక్కొక్క మహిళకు మహాలక్ష్మి పథకం ద్వారా రూ.55 వేలు, వృద్ధులకు వృద్ధాప్య పింఛన్ల ద్వారా రూ.44 వేలు, కళ్యాణ లక్ష్మి, తులం బంగారం, రైతు బంధు ద్వారా రూ.76 వేలు, నిరుద్యోగ యువతకు రెండు లక్షల ఉద్యోగాలు బాకీ, రాష్ట్రంలోని యువతులకు స్కూటీల బాకీ పడిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ రెండేళ్ల పాలనపై ప్రజలు విసుగెత్తారని, రాష్ట్రానికి, రాష్ట్ర ప్రజలకు బీఆర్ఎస్ పార్టీయే శ్రీరామ రక్ష అన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ బాకీ కార్డు ఉద్యమాన్ని ప్రతి ఇంటికి చేర్చాల్సిన బాధ్యత నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు, మాజీ చైర్మన్లు, మాజీ డిప్యూటీ మేయర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, డివిజన్ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకురాలు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు బీఆర్ఎస్ అండగా ఉంటుంది

కార్యకర్తలకు బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హామీ మేరకు సోమవారం ఆయన బోరబండ డివిజన్ ఎస్.ఆర్.టి నగర్‌కు చెందిన దివంగత సర్దార్ కుటుంబాన్ని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఇన్‌చార్జి రాగిడి లక్ష్మారెడ్డితో కలిసి పరామర్శించి రూ.3 లక్షల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బోరబండ డివిజన్‌లో పార్టీ బలోపేతానికి పాటుపడిన సర్దార్ ఇంటి నిర్మాణం చేపడుతుంటే కాంగ్రెస్ నాయకులు ఎదుగుదలను చూసి ఓర్వలేక కక్షపూరితంగా వ్యవహరించారన్నారు. ఆయన ఇంటి నిర్మాణాన్ని కూల్చివేయించడంతో మనస్తాపానికి లోనైన సర్దార్ ఆత్మహత్యకు పాల్పడ్డారని, ఆయన కుటుంబానికి బీఆర్ఎస్ ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



సర్దార్ కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్ తదితరులు

గండం గట్టెక్కిందా..?

హైడ్రా కూల్చివేత హెచ్చరికలపై స్థానికుల ఆందోళన



సర్వే నంబర్ 307 లో హైడ్రా అధికారులు కూల్చివేసిన నిర్మాణాలు

గాజులరామారం: గాజులరామారం సర్వేనెంబర్ 307, 308 లో అక్టోబర్ 6న మరోసారి కూల్చివేతలు చేపడతామని హెచ్చరించిన హైడ్రా అధికారులు రాకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. సర్వే నంబర్ 307,308 సర్వే నెంబర్ లోని బాలయ్య నగర్, రావి నారాయణరెడ్డి నగర్, గాలి పోచమ్మ బస్తీ, ప్రగతి నగర్ సమీపంలో సెప్టెంబర్ 21న భారీ పోలీసు బందోబస్తు మధ్య హైడ్రా, రెవెన్యూ అధికారులు 300 లకు పైగా నిర్మాణాలను నేలమట్టం చేశారు. అందులో 60 శాతం మేర నివాసం ఉండని ఇళ్లను కూల్చివేశారు. గత కొన్నేళ్లుగా నివాసం ఉంటున్న మిగతా ఇళ్లను కూడా అక్టోబర్ 6న వచ్చి ఖాళీ చేయిస్తామని హెచ్చరించి వెళ్లిపోయారు. దీంతో ఇళ్లు కోల్పోయిన నివాసితులు అధికారుల తీరుపై రోజుకొక నిరసన వ్యక్తం చేశారు. ఈ విషయమై మాజీ మంత్రి మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ హైడ్రాధికారులపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మరోసారి పేదల ఇల్ల జోలికి వస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. తెలంగాణ మహిళా జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అక్టోబర్ 6న అధికారులు వస్తే జేసీబీకి



శిథిలాల వద్దే కాలం గడుపుతున్న బాధితులు..

తానే అడ్డుగా నిలుస్తానని హెచ్చరించారు. ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ మిగతా ప్రజా ప్రతినిధులు కూడా తాము అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఏది ఏమైనా గత కొన్నేళ్లుగా స్థానికంగా నివాసం ఉంటున్న వారు అక్టోబర్ 6న ఏమి జరుగుతుందోనని బిక్కు బిక్కు మంటూ కాలం గడిపారు. ఒకరోజు ముందు నుంచే సోమవారం పనులకు వెళ్లకుండా ఇంటి వద్దనే గడిపారు. మరి కొందరు ముందస్తుగా కోర్టు నుంచి స్టే తెచ్చుకున్నారు. అయినా ఇలా బిక్కుబిక్కుమంటూ ఎన్ని రోజులు గడపాలో అర్థం కావట్లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

'బాకీ కార్డు' ఉద్యమంపై విస్తృత ప్రచారం

దుండిగల్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన నయవంచక హామీలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు చేపట్టిన 'బాకీ కార్డు ఉద్యమం'ను మేడ్చల్ జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా నిర్వహించాలని నేతలు అన్నారు. ఈ మేరకు సోమవారం మేడ్చల్ బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు ఆధ్వర్యంలో పార్టీ ప్రజా ప్రతినిధులు, ముఖ్య నాయకులు సమావేశమయ్యారు. సమావేశంలో ఎమ్మెల్యేలు మల్లా రెడ్డి, మాధవరం కృష్ణారావు, కెపి వివేకానంద్, బండారి లక్ష్మా రెడ్డి, మర్రి రాజశేఖర్ రెడ్డి, మల్కాజిగిరి పార్లమెంట్ ఇంచార్జి రాగిడి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ మోసపూరిత వైఖరిని బయటపెట్టడానికి బీఆర్ఎస్ పార్టీ 'బాకీ కార్డు' రూపంలో ప్రజల్లోకి వస్తోందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బాకీ కార్డు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ నేతలు

హెచ్‌ఎండీఏ కమిషనర్‌పై ఫిర్యాదు



అదనపు కలెక్టర్ రాధికా గుప్తాకు వినతిపత్రం అందజేస్తున్న ఆకుల సతీష్

నిజాంపేట్ : బాచుపల్లి కోమటికుంట చెరువులో వాసవి కన్‌స్ట్రక్షన్ సంస్థ ఎఫ్‌టీఎల్ బఫర్ జోన్‌లో అక్రమంగా నిర్మాణాలు చేపట్టినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ హెచ్‌ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్‌పై ఆకుల సతీష్ ఫిర్యాదు చేశారు. మేడ్చల్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాధికా గుప్తాకు ఫిర్యాదు అందజేశారు. ఈ సందర్భంగా ఆకుల సతీష్ మాట్లాడుతూ చెరువులో 8,9 బ్లాకుల్లో నిర్మాణాలు చేపట్టిన వాసవి సంస్థపై గతంలోనే రెండు పోలీసు కేసులు నమోదయ్యాయన్నారు. రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ శాఖల సంయుక్త సర్వేలో కూడా ఆక్రమణలు జరిగినట్లు నిర్ధారించారన్నారు. హైకోర్టు తీర్పు ప్రకారం అక్రమ నిర్మాణాలను కూల్చివేసి చెరువును రక్షించాలని ఉత్తర్వులు ఉన్నా, హెచ్‌ఎండీఏ కమిషనర్ అందుకు విరుద్ధంగా వాసవి నిర్మాణాలకు అనుమతి ఇచ్చారని ఆరోపించారు. హెచ్‌ఎండీఏ కమిషనర్ ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేసి, కోమటికుంట చెరువును రక్షించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం, హైడ్రా కమిషనర్, జిల్లా కలెక్టర్‌లను కోరారు. కార్యక్రమంలో అమలేశ్వరి, శ్రీనివాస్‌గౌడ్, అరుణ్‌రావు, కవితరెడ్డి, చందు, పాండు తదితరులు పాల్గొన్నారు.

జీడిమెట్ల పోలీసుల స్పెషల్ డ్రైవ్

హెల్మెట్ వాడకంపై వినూత్న ప్రచారం



జీడిమెట్ల: జీడిమెట్ల పోలీసులు ట్రాఫిక్ నిబంధనలపై స్పెషల్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేష్ ఆధ్వర్యంలో సోమవారం షాపూర్ నగర్‌లో తనిఖీలు చేపట్టిన పోలీసులు హెల్మెట్ ధరించని వాహన చోదకులను ఆపి వారి ఫోన్‌లో వారితోనే సెల్ఫీఫోటో తీశారు. అదే ఫోటోను రైడర్ ఫోన్‌లో స్టేటస్ పెట్టించారు. అందులో ఈ రోజు నేను హెల్మెట్ లేకుండా బండి నడిపాను పోలీసులు నాకు కౌన్సెలింగ్ నిర్వహించి నా మంచి కోసం స్టేటస్ పెట్టారు అని పెట్టించారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా సోమవారం దాదాపు 100మందికి పైగా కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మల్లేష్ మాట్లాడుతూ ద్విచక్ర వాహన చోదకుల్లో మార్పు రావాలని డ్రైవ్ నిర్వహించినట్లు తెలిపారు.

డ్రైనేజీ పైప్‌లైన్లు మార్చాలని వినతి

చింతల్: చింతల్ కాలనీలో పది గల్లీలలో డ్రైనేజీ పైప్ లైన్లు మార్చాలని చింతల్ వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు అన్నారు. ఈ మేరకు సోమవారం కుత్బుల్లాపూర్ వాటర్‌వర్క్స్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో జీఎం మాధవిని కలిసి ఫిర్యాదు చేశారు. చింతల కాలనీలోని 10 గల్లీల్లో సుమారు 1800 మీటర్ల పైగా భూగర్భ డ్రైనేజీ పైప్ లైన్ వ్యవస్థ మార్చాలని కోరారు. 15 ఏళ్ల క్రితం వేసిన భూగర్భ డ్రైనేజీ పైపులు చిన్నగా ఉన్నందున ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు రాధాకష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, ఉపాధ్యక్షులు బాల్ రెడ్డి, బాలకృష్ణారెడ్డి, కమిటీ సభ్యులు శ్రీరామ్ మూర్తి, పురుషోత్తం రెడ్డి ఉన్నారు. ప్రజావాణిలో మొత్తం ఎనిమిది ఫిర్యాదులు అందినట్లు అధికారులు పేర్కొన్నారు.



వాటర్ వర్క్స్ జీఎం మాధవికి ఫిర్యాదు చేస్తున్న అసోసియేషన్ సభ్యులు

కాంగ్రెస్ హయాంలోనే రాష్ట్రాభివృద్ధి



ఎల్‌జీ విస్టాలో బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న కొలన్ హన్మంతరెడ్డి..

కుత్బుల్లాపూర్: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొలన్ హన్మంత రెడ్డి అన్నారు. కొంపల్లి మున్సిపల్ పరిధి ఎల్‌జీ విస్టాస్‌లో రూ.40 లక్షలు చేపట్టనున్న బీటీ రోడ్డు పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా హన్మంతరెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో మున్సిపాలిటీల్లో అభివృద్ధి మందగించిదన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు సహకారంతో నియోకవర్గ వ్యాప్తంగా అభివృద్ధి పనుల్లో వేగం పుంజుకుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు బైరి ప్రశాంత్ గౌడ్, మాజీ కౌన్సిలర్ శివ కుమార్ గౌడ్, జిల్లా లేబర్ సెల్ ప్రెసిడెంట్ సుదర్శన్ రెడ్డి, మాజీ వార్డు మెంబర్ కావాలి గోపాల్ ముదిరాజ్, మాజీ ఉప సర్పంచ్ గోపాల్ రెడ్డి, మోహన్ రెడ్డి, జైబెరి గోపాల్ రెడ్డి, అంజి ముదిరాజ్, నాగరాజు యాదవ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సిద్దనోళ్ల సంజీవ రెడ్డి కాలనీ అధ్యక్షుడు భాగ్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయనగర్‌లో నాకాబందీ...

మూసాపేట: కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆంజనేయ నగర్‌లో బాలానగర్ జోన్ డీసీపీ సురేష్ కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి నాకాబందీ నిర్వహించారు. డీసీపీతో పాటు , ఏసీపీ రవికిరణ్ రెడ్డి నేతృత్వంలో 101 మంది పోలీస్ సిబ్బంది నాకా బందీలో పాల్గొన్నారు. సుమారు 1205 వాహనాలను తనిఖీ చేసి పత్రాలు లేకుండా ఉన్న వాహనాలు, తప్పుడు నెంబర్ ప్లేట్ ఉన్న వాహనాలు, మద్యం సేవించి డ్రైవింగ్ చేస్తున్న వారిని వారి వాహనాలను పరిశీలించి కేసు నమోదు చేశారు. ద్విచక్ర వాహనాలు 68, మూడు చక్రాల వాహనం 1, నాలుగు చక్రాల వాహనాలు 4ను స్వాధీనం చేసుకున్నారు. మద్యం సేవించి వాహనం నడిపిన 11 మందిపై కేసులు నమోదు చేశారు.



వాహన పత్రాలను పరిశీలిస్తున్న డీసీపీ సురేష్ కుమార్

అధికారుల నిర్లక్ష్యం..ప్రజలకు శాపం



కొనసాగుతున్న బాక్స్ డ్రైన్ నిర్మాణ పనులు



లీకవుతున్న తాగునీరు..

- బాక్స్ డ్రైన్ నిర్మాణ పనులతో నిలిచిపోయిన తాగునీటి సరఫరా
- పట్టించుకోని జలమండలి అధికారులు
- తాగునీరు అందక పలు కాలనీల వాసుల అవస్థలు

చింతల్: అభివృద్ధి పనుల పేరుతో ఇష్టారాజ్యంగా చేపట్టిన తవ్వకాలు పలు ప్రాంతాల ప్రజల పాలిట శాపంగా మారాయి. పైప్‌లైన్లు ఉన్నచోట వాటిని గమనించి తవ్వకాలు చేపట్టాల్సి ఉండగా అధికారుల బాధ్యతా రాహిత్యం, అనుభవం లేని కాంట్రాక్టర్లకు పనులు కట్టబెట్టడంతో ప్రజలు తాగునీరు అందక అవస్థలు పడుతున్నారు. గాజులరామారం సెక్షన్ పరిధిలోని షిరిడీ హిల్స్ , మహదేవపురం తదితర ప్రాంతాల్లో బాక్స్ నాలా నిర్మాణ పనులు చేపట్టారు. ఈ క్రమంలో నాలా రోడ్డు క్రాసింగ్ వద్ద పైప్ లైన్లను, కేబుళ్లను గమనించకపోవడంతో పైప్ లైన్ ధ్వంసమైంది. దీంతో పాటుగా ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలకు చెందిన కేబుల్ వైర్లు కూడా ధ్వంసమయ్యాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

20 రోజులుగా తాగునీటి అవస్థలు...

మహాదేవపురం చౌరస్తా నుంచి షిరిడి హిల్స్ వెళ్లే దారిలో 300 ఎంఎం డయా పైప్ లైన్ వెళుతోంది. ఈ పైపులైన్ సమీపంలోనే మహదేవపురం మీదుగా బాక్స్ నాలా నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో మహదేవపురం చౌరస్తా వద్ద జీహెచ్‌ఎంసీ అధికారులు చేపట్టిన తవ్వకాలతో 300 ఎంఎం డయా పైప్‌లైన్ వాల్వ్‌తో సహా తొలగించారు. దీంతో షిరిడీ హిల్స్ తాగునీటి సరఫరా నిలిచిపోయింది. సుమారు 5 గల్లీల ప్రజలకు ఈ పైపులైన్ ద్వారానే తాగునీరు సరఫరా అవుతుంది. షిరిడి హిల్స్‌లో కొంతమేర కైలాష్ హిల్స్ గుండా తాగునీటి సరఫరా అవుతుండగా మరికొంత భాగం మహదేవపురం మీదుగా షిరిడీ హిల్స్‌కు నీటి సరఫరా కొనసాగుతోంది.

- జీహెచ్‌ఎంసీ అధికారులు చేపట్టిన తవ్వకాలతో పైప్‌లైన్ ధ్వంసమైనందున జీహెచ్‌ఎంసీకి సంబంధించిన వారే మరమ్మతులు చేపట్టాలని స్థానిక జలమండలి అధికారులు సూచించారు. దీంతో సదరు కాంట్రాక్టర్ తమ సిబ్బందితో వచ్చి మరమ్మతులు చేపట్టే ప్రయత్నం చేశారు. అయితే వారిని అనుభవం లేనందున మరమ్మతులు చేపట్టిన మొదటి రోజే మళ్లీ యథాస్థితికి చేరుకుంది. దీంతో తాగునీరు వృథాగా పోయింది. నత్త నడకన సాగుతున్న నాలా కల్వర్టు నిర్మాణం పూర్తయితే గానీ అక్కడి ప్రజలకు తాగునీరు అందే సూచనలు కనిపించడం లేదు. జలమండలి అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాల్సి ఉన్నా కొన్ని గల్లీలకే కదా అంటూ కాలం వెళ్లదీస్తూ నాలా నిర్మాణం పేరుతో మరమ్మతులు చేపట్టడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.
- కల్వర్టు నిర్మాణం కారణంగా ఇప్పటికే మూడు రోజులకు ఒకసారి వచ్చే నీటి సరఫరాతో నాలుగు సప్లయ్‌లలో తాగునీరు నిలిచిపోయింది. ఓ వైపు తమ ఇళ్లల్లో ఉన్న బోర్ల ద్వారా నీరు వస్తున్నప్పటికీ అవి కొంతమేర స్థానికంగా ఉన్న చెరువు కారణంగా కలుషితమయ్యాయని, దీంతో తాగునీటికి గోదావరి జలాలే దిక్కు అని. త్వరితగతిన పనులు పూర్తిచేసి నీటి సరఫరాను పునరుద్దరించాలని స్థానికులు కోరుతున్నారు.

PUBLIC NOTICE

The General Public is hereby informed that my clients 1. Mr. Bonthu Amar Kumar S/o. B. Venkat Rao, aged 43 years, R/o. Plot No. 352, Quthbullapur, intended to purchase the below schedule property from its owner Mr. Jinna Ram Reddy, aged about 60 years, in favor of Mr. Bonthu Amar Kumar also entered into Agreement of sale dated 06.06.2025 paid substantial amount of sale consideration. In case anyone has got any right/title/interest/claims over the under mentioned property they may approach undersigned within 7 days from the date of publication of the notice along with necessary proofs to substantial their claim. If no response is received within 7 days, it is presumed that the property is free of any charge/claim/encumbrance and my clients shall proceed for registration of the property.

Schedule Property: All that the Plot no. 25 Part (Part of East Side Portion), admeasuring 125 Sq. Yards (out of 250 sq. yds), in Sy. No. 109, situated at Padmanagar Colony-I, Quthbullapur (V & M), Medchal-Malkajgiri Dist and bounded by: **North:** Plot No. 26, **South:** Plot No. 25 Part (Part of East Side Portion), **East:** 30 Ft Wide Road, **West:** Plot No. 25/Part (West Side Portion) of Anasuya

V MAHENDER REDDY Advocate
R/o: Plot No. B-57, Phase-II, Allwyn Colony, Kukatpally Hyderabad-500072
PH: 9440538936

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220366
9912348029